క్లుప్తంగా

ప్రతి కార్డుదారునికి ఉచిత బియ్యం

కలకడ : మండలంలోని ప్రతి కార్డు దారునికి ఉచిత బియ్యం అందించే బాధ్యత ఎండీయూ ఆపరేటర్లపై ఉందని సీఎస్‌డీటీ వెంకటరెడ్డి, కోన వీఆర్‌ఓ రవిచంద్రన్ తెలిపారు. బుధవారం మండలంలోని కోన, నడిమిచెర్ల, కదిరాయచెర్వు, ఎనుగొండపాళ్యం పంచాయతీలలో పర్యటించి ఎండీయూ ఆపరేటర్లు పంపిణీ చేస్తున్న వాహనాలలో బియ్యంతో పాటు, కందిపప్పు, చక్కెర, వాహనంలో ఉంద లేదా అని తనిఖీ చేశారు.

నేటి నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్

కేవీపల్లె : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నుంచి శ్రీ గర్నిమిట్ట యల్లమ్మతల్లి మండల స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీనురెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి చేతుల మీదుగా టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. టోర్నీలో విజేతకు రూ. 21,116 నగదు బహుమతి ఇస్తామని తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కురబలకోట: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నేతృత్వంలో మండలంలోని తూపల్లె, దాదంవారిపల్లె పరిసర గ్రామాల్లో గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ బైసాని జ్యోతి, చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, గ్రామ ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, అధికార, ఉద్యోగులు హాజరుకావాల్సిందిగా కోరారు.

జాతీయ సమావేశానికి తరలిన నాయకులు

రామసముద్రం: ఎస్సీ వర్గీకరణపై కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో బుధవారం జరిగిన ఎంఆర్‌పీఎస్ మందకృష్ణ మాదిగ జాతీయ సమావేశానికి రామసముద్రం నుంచి ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని బీజేపీ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు జాతీయ మహాసభను విజయవంతం చేసేందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షులు రాజేష్, కొండప్ప ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న సీఐ నాగేంద్ర

గుర్రంకొండ: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని సీఐ నాగేంద్ర అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, జూదాలపై ఇప్పటికే నిఘా ఉంచామన్నారు. ఎవరైనా సమాచారం అందిస్తే గోప్యంగా ఉంచి చర్యలు చేపడతామన్నారు. అలాగే గుర్రంకొండ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారిస్తామన్నారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వవద్దని, ఇచ్చేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నరసింహులు, హెడ్‌కానిస్టేబుళ్లు నాగరాజు, శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

జూదం ఆడితే చర్యలు

వాల్మీకిపురం: సంక్రాంతి పండగను పురస్కరించుకొని గ్రామాల్లో కోడి పందెం, పేకాట తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ సురేష్ హెచ్చరించారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరుగుతుంటే ప్రజలు తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బిందుమాధవి, సిబ్బంది, పాల్గొన్నారు.

వడ్డెర ఓబన్న జయంతి వేడుక

బి.కొత్తకోట : వడ్డెర ఓబన్న 216వ జయంతి వేడుకలను బుధవారం బి.కొత్తకోటలో నిర్వహించారు. జిల్లా వడ్డెర సాధికార సమితి అధ్యక్షులు డేరంగుల నారాయణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబన్న బ్రిటీష్ పాలకులను ఎదిరించి చరిత్రకెక్కారని అన్నారు. కార్యక్రమంలో శంకర నారాయణ, పద్మనాభం, కిట్టన్న, శివన్న, ఆదిమూర్తి, రామచంద్ర, వెంకటరమణ, అర్జున్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ములకలచెరువు : మండలంలో కోడిపందెం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ డీవై స్వామి బుధవారం తెలిపారు. మండలంలోని మద్దినాయునిపల్లి పంచాయతీ పూలకుంట్లపల్లె వద్ద కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడుల్లో నలుగురిని అరెస్టు చేసి రూ.3 వేల నగదు, ఒక కోడి, కత్తులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- మేనిఫెస్టోలో 98 శాతం హామీలు అమలు
- 29వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని 29వ వార్డు గొల్లపల్లె క్రాస్ సచివాలయ పరిధిలో కౌన్సిలర్ బొమ్మిడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను పలుకరించారు. వైఎస్సార్ సీపీ మూడున్నరేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని పథకాల పేర్లతో సహా వివరిస్తూ ప్రత్యేకంగా ముద్రించిన బుక్‌లెట్స్‌ను అందించారు. స్థానిక సమస్యలు తెలపాల్సిందిగా ప్రజలను కోరారు. ఎన్నికలకు ముందు రెండు పేజీల మేనిఫెస్టోను ప్రకటించి, అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ల కాలంలో 98 శాతానికి పైగా హామీలను అమలుపరిచిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల తాము నిర్భయంగా ఉండగలుగుతున్నామని, ఆర్థిక భరోసా కలిగి జీవిస్తున్నామని ప్రజలు చెపుతుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తూ సీఎం జగన్ జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ ముందుకు సాగుతుంటే ఓర్వలేని ప్రతిపక్షనేత చంద్రబాబు, ఆయన దత్త పుత్రుడు పవన్‌కల్యాణ్ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీ నివాసులు, వసీం, ఎస్వీ.రమణ, రాజేష్, ప్రసాద్ బాబు, కోఆప్షన్ శారదారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మెట్రోబాబ్‌జాన్, బాలగంగాధరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శరత్‌రెడ్డి, మంజుల, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు

– మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

కేవీపల్లె : ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నూగూలితండా, జిల్లేళ్ల మంద, వల్లకుంట కొత్తపల్లె గ్రామ పంచాయతీలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాల గురించి క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందిపై ఉందని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు మండలంలోని గర్నిమిట్టలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సర్పంచ్‌లు కృష్ణవేణి, అమ్ములు, నాయకులు రెడ్డినాయక్, గజపతిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

జ్ఞానాంబిక కళాశాలకు న్యాక్ 'ఏ' ప్లస్ గ్రేడ్


న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు ఉత్తర్వులను చూపుతున్న కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్

మదనపల్లె : పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు ప్రతిష్టాత్మకమైన న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించిందని కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు పొందిన మొదటి కళాశాలగా రికార్డు సాధించామన్నారు. ఈనెల 5,6 తేదీల్లో ముగ్గురు సభ్యులతో కూడిన న్యాక్ పీర్ కమిటీ కళాశాలను సందర్శించిందన్నారు. కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యాప్రమాణాలు, బోధన, బోధనేతర వసతులు, అమలు చేస్తున్న విధానాలు వీటన్నంటిని పరిశీలించిన కమిటీ కళాశాలకు ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు ఇచ్చిందన్నారు. ఈమేరకు బెంగళూరులోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిషన్ కౌన్సిల్ (నాక్) కార్యాలయం నుండి బుధవారం ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఈ గుర్తింపుతో ఉన్నతవిద్యలో మరింత నాణ్యతా ప్రమాణాలు పెరుగుతాయన్నారు. ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు రాఘవేంద్ర, మాలాలి, రమ్య పాల్గొన్నారు.

పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకే రుణాలు


మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమలశాఖ అధికారి నాగరాజు

తంబళ్లపల్లె: నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకే రుణసౌకర్యం కల్పిస్తున్నట్లు జిల్లా పరిశ్రమలశాఖ అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం స్త్రీశక్తి భవన్‌లో వైఎస్సార్ క్రాంతిపథం మహిళా సంఘ సభ్యులతో సమావేశం జరిగింది. ప్రధానమంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీసీ) ద్వారా ఉత్పత్తి, సేవా రంగాలలో అభివృద్ధి సాధించేందుకు 18 ఏళ్లు పైబడిన వారికి ఈ రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఓసీ జనరల్ అభ్యర్థులకు 25శాతం , ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు 35 శాతం సబ్సిడీతో ఈ రుణాలు ఇస్తారన్నారు. లబ్ధిదారులు ఎంచుకునే యూనిట్‌ను బట్టి రూ.20లక్షల నుంచి రూ.50లక్షలు రుణాలను బ్యాంకుల ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల అభివృద్ధి కమిటీచైర్మన్ నారాయణరెడ్డి, ఏపీయం గంగాధర్, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమ పథకాలపై అవగాహన

నిమ్మనపల్లె: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్, మదనపల్లె ఉద్యానవనశాఖాధికారి ఈశ్వరప్రసాద్‌రెడ్డి అవగాహన కల్పించారు. బుధవారం నిమ్మనపల్లె రైతు భరోసా కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ రైతుభరోసా పెట్టుబడి సాయం నిధులు పీఎం కిసాన్ నిధులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయన్నారు. ఈ పథకాల్లో నమోదైన రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. పంటల బీమా, పంట నష్ట పరిహారం, రైతుల వడ్డీమాఫీ నిధులు పొందేందుకు పంటలను ఈక్రాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆర్‌బీకె కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. టమాట రైతులకు ఒక్కో ప్రొసెసింగ్ మొలక 20 పైసలకే అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బంది శ్రీకాంత్, కుమార్‌నాయక్, నాయకులు విజయకుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, రెడ్డిభాస్కర,, శరత్‌కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పీలేరు రూరల్ : స్థానిక చిత్తూరు మార్గంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం బోగిమంటలు ముగ్గుల పోటీలు, డ్యాన్స్‌తోపాటు విద్యార్థులు వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ బి.వి. శ్రీలత మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, సూపరింటెండెంట్ విజయకుమార్, వాణి, సుజాత పాల్గొన్నారు.

వాల్మీకిపురం: సమాజంలో రోజురోజుకు అంతరించిపోతున్న సంప్రదాయాలను కాపాడుకోవాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ప్యారంపల్లి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి, భోగి పండగలను నిర్వహించి, విద్యార్థులకు సంప్రదాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.

కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం బోగిమంటలు వేసి గొబ్బిళ్లతో సంబరాలు చేసుకున్నారు. హెచ్‌ఎం చంద్రయ్య భోగి, మకర సంక్రాంతి, కనుమపండుగ విశిష్టతను వివరించారు.

పెద్దతిప్పసముద్రం: స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో ముందస్తు సంక్రాంతి సందడి నెలకొంది. బుధవారం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులతో పాఠశాలకు హాజరై ఒకరికొకరు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ముగ్గుల పోటీలో ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

కలికిరి : పట్టణ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. క్రాస్ రోడ్డు సిద్దార్థ పాఠశాలలో, ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు, పాఠశాల ఆవరణలో గొబ్బెమ్మలు, భోగి మంటలతో కోలాహలంగా సంబరాలు జరుపుకున్నారు.

బి.కొత్తకోట: ముగ్గులు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలను ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.ప్రసాద్ అన్నారు. బుధవారం సంతూర్ సోప్ సౌజన్యంతో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు

డీఎస్పీ కేశవ్ప

మదనపల్లె : మైనర్లు రోడ్లపై వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కేశవ్ప తెలిపారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐలు సాదిక్ అలీ, సత్యనారాయణతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనచోదకులు ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా వాహనాలను డ్రైవ్ చేస్తున్నారన్నారు. మైనర్‌లు వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టరీత్యా చర్యలతో పాటు లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తామన్నారు. రోడ్డు సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని స్పష్టం చేశారు. మైనర్ విద్యార్థులకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం అత్యంత కఠినమైన నేరంగా పరిగణిస్తామన్నారు. వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ సాదిక్‌అలీ మాట్లాడుతూ.. ప్రజలు సైబర్‌నేరాలపై అప్రమత్తత కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్లను తెరవడం, నగదు లావాదేవీలు నిర్వహించడం శ్రేయస్కరం కాదన్నారు. తాలూకా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఊర్లకు వెళ్లే ప్రజలు తమ చిరునామాను స్టేషన్‌లో ఇచ్చి వెళితే ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టంను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హరిహరప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

పెద్దతిప్పసముద్రం: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన ద్విచక్ర వాహనాలను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చని ఎస్‌ఐ సూచించారు.

కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు


జ్యోతి వెలిగిస్తున్న డీఎస్పీ కేశవ్ప

కురబలకోట: విద్యార్థులు కష్టపడి చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మదనపల్లె డీఎస్పీ కేశవ్ప, ప్రకృతి వనం ప్రసాద్ సూచించారు. అంగళ్లులోని విశ్వం డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో వారు మాట్లాడుతూ విద్యార్థుల జీవితం చదువు సంధ్యలతో ముడిపడి ఉంటుందన్నారు.ఉన్నత ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలంటే ఇందుకు అనుగుణంగా డిగ్రీ తొలి ఏడాది నుండే నిర్దేశిత లక్ష్యంతో చదువుల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్నారు. శాస్త్రవేత్త దీవ, విశ్వం ప్రభాకర్‌రెడ్డి, రఘునాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఐటీటీటీఆర్‌తో మిట్స్ ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

కురబలకోట: మండలంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చెన్నైలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్‌ఐటీటీటీఆర్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ బుధవారం తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణలు, నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా అఫ్జామొహిద్దీన్


నియామకపు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే చింతల

పీలేరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా కలికిరి మండలం గడికి చెందిన అఫ్జామొహిద్దీన్‌ను నియమితులయ్యారు. బుధవారం ఆయనకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడైన అఫ్జామొహిద్దీన్ ఇటీవలే వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. ఆయనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు చెప్పారు. అఫ్జామొహిద్దీన్ మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్ తోపాటు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలి

వాల్మీకిపురం: విద్యార్థులకు ఆంగ్లంపై పట్టు సాధించేలా అధ్యాపకులు తీర్చిదిద్దాలని కడప ఆర్‌జేడీ బాబు అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, న్యాక్, ఎఫ్ఆర్ఎస్, ఫీ యాప్, తదితర అంశాలపై అధ్యాపకులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆర్‌జేడీ బాబును వైస్ ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి సన్మానించారు.

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే లక్ష్యం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : ప్రతి కుటుంబాన్ని సంతోషంగా ఉంచాలన్నదే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిఅన్నారు. బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో 305 నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీకి కట్టుబడి పింఛన్లు రూ. 2750 పెంచి ఇస్తున్నారని తెలిపారు. కొన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు రూ. 5 వేల నుంచి రూ. 10వేల వరకు పింఛన్లు ఇస్తున్న ఘనత మన రాష్ట్రానికే దక్కిందన్నారు. మన రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలను సైతం ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మరాదన్నారు.

జాతీయ జెండా ఆవిష్కరణ

స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంపై ఏర్పాటు చేసిన 55 అడుగుల స్తంభంపై 16కు 23 అడుగుల జాతీయ జెండాను బుధవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడాలేని విధంగా పీలేరులో శాశ్వత జాతీయ జెండాను ఏర్పాటు చేసిన సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అభినందనీయులని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు షఫీ, వైస్ ఎంపీపీ చలపతి, సింగిల్‌విండో అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు హుమయూన్, మహిత, రెడ్డిబాషా, నాగరాజమ్మ, ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మామిడి సస్యరక్షణపై శిక్షణ


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు

కలికిరి: రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంస్థ (ఎఫ్‌పీఓ), ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మండలంలోని టి.సంగ్రావారిపల్లిలో రైతులకు మామిడిలో సస్యరక్షణ చర్యలపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు మాట్లాడుతూ పూత రాలకుండా, పిందె దశలో పిచికారీ చేయాల్సిన రసాయనిక మందులు, బూడిద తెగులు నివారణ, పిందెలకు మ్యాంగో కవర్లు వాడకం పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఓలు లక్ష్మీప్రసన్న, సుకుమార్, ఎఫ్‌పీఓ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఎఫ్‌పీఓ సిబ్బంది, కలికిరి, కేవీపల్లి, పీలేరు, కలకడ మండలాల మామిడి రైతులు పాల్గొన్నారు.

14న మకర జ్యోతి దర్శనం

మదనపల్లె సిటీ: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 14న మకర జ్యోతి దర్శనం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు జీవీ రమణ, రవిలు తెలిపారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు గణపతి హోమం, 7.30 అభిషేకం, 9 గంటలకు అయ్యప్పమాలాధారులతో స్వామి తిరు ఆభరణాలు ఊరేగింపు, ఇరుముడులు చెల్లింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటలకు సంక్రాంతి పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. సాయంత్రం 6.50 గంటలకు మకరజ్యోతి దర్శనం ఉంటుందన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆర్బీకే కేంద్రం తనిఖీ

ములకలచెరువు: మండలంలోని దేవులచెరువు, వేపూరికోట ఆర్బీకే కేంద్రాలను అన్నమయ్య జిల్లా జేడీఏ ఉమామహేశ్వరీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు పరిశీలించారు. పీయం కిసాన్ కోసం ప్రతి రైతు వద్ద ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌ను పరిశీలించారు. ఆమె వెంట ఏడీఏ శివశంకర్, ల్యాబ్ ఏఓ మంజులా, ఏఈఓ సుబ్రమణ్యం ఉన్నారు.

పంటల పరిశీలన

పెద్దతిప్పసముద్రం : జిల్లా వ్యవసాయశాఖాధికారి ఉమామహేశ్వరమ్మ బుధవారం మండలంలోని కాట్నగల్లు, పులికల్లు పంచాయతీల్లో పర్యటించారు. రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించారు. ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ వివరాలను ఏవో ప్రేమలతను అడిగి తెలుసుకున్నారు.